ప్రధానమైన సమస్యలను, తీర్చకుండా ప్రభుత్వం "ఆహార సమస్య" "నిరుద్యోగ సమస్య" లాంటి చిల్లర విషయాలపై కాలమంతా వృధా చేయటం చూస్తే యెంత బాధ్యతారహితంగా ప్రవర్తిస్తోందో అర్థమవుతుంది.

ఆంధ్రప్రాంతానికి సంబంధించినంత వరకూ వెంటనే విశాఖపట్నంలో ప్రేమజ్వరాలకు ఒకవార్డు కేటాయించాలి. ప్రభుత్వం మా హెచ్చరికలను గుర్తించి మా సూచనల నమలు పరిస్తే పరిస్థితి వెంటనే అదుపులోనికి రాకపోదు.

ప్రజలు కూడా యీ వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండాలి విలాస విహారాలలో చాలా జాగ్రత్తగా మెలగాలి. ఈ వ్యాధి ప్రబలంగా వున్న పట్టణాల్లోనూ, సినిమా స్టుడియోల్లోనూ వెంటనే టీకాలు వేయించుకొని, ఆరునెలల పాటు "అష్టాష్టరి" మంత్రం రోజుకు ఆరువేల పర్యాయాలు జపించాలి.

అది రాకపోతే కనీసం "అక్కరకురాని చుట్టము..." లాంటి పద్యాలన్నయినా పదహారు వందల పదహారుసార్లు జరిపించడం మంచిది. ఆంధ్రప్రజానీకం కేటలాగు మందులకు మోసపోక పై సలహాలను పాటిస్తే మేము పరమ ధన్యులం.

---

స్కెచ్

# పార్కులో పెద్దమనిషి

జి. వి. జి. కృష్ణ

సరిగ్గా నిన్నటికి ఒక నెలముందు, ఇదే పార్కులో ఇదే చెట్టుక్రింద ఇదే బల్లపై ఆ వ్యక్తితో పరిచయమైనది నాకు.

ఆయనకు దాదాపు యాభైయేళ్లకు పైగా ఉంటాయి. నెరిసిపోయిన మీసాలతో మాసిపోయిన దుస్తులతో వున్న ఆ నల్లటి విగ్రహాన్ని మొట్టమొదట చూడగానే నాకు కొద్దిగా నవ్వు వచ్చింది. ఆమనిషి నన్ను చూడగానే చిన్న చిరునవ్వు నవ్వి "రా .. కూర్చో నాయనా!" అంటూ కొద్దిగా పక్కకు జరిగి నాకు ఆ బల్ల మీద సీటు ఇచ్చాడు.

"బ్రాహ్మలేనా?"

అవునన్నాను.

సంతృప్తిగా మరో చిరునవ్వు నవ్వి, "ఉపనయనం అయిందా?" అన్నాడు.

తల ఊగులాడించాను.

"యజ్ఞోపవీతం ఉందా?" అని అడిగాడు.

సగం చచ్చాను. ఏదో పెద్ద తప్పు చేసిన వాడిలా మొహంపెట్టి "లేదండీ. ఇటీవల్నే తీసేశాను" అని అన్నాను.

అంత మాత్రానికే ఆకాశమంతెత్తుకు ఎగిరే వాడిలా మొహం పెట్టి "ఛుక్ ఛుక్ ఛుక్. ఎంత తప్పుపని చేశావబ్బాయ్! అలా వుండకూడదు నాయనా! మా ఇంట్లో ఒకజత వున్నట్లుంది, రేపిక్కడికొచ్చేటప్పుడు తెస్తా, దాన్ని వేసుకుని పునః పవిత్రుడివి కా" అన్నాడు.

ఆయనకు నాపట్ల ఇంత వాత్సల్యం కలగటానికి గల కారణమేమిటో తెలియకపోయినా ఆయన ఔదార్యానికి కృతజ్ఞతగా నే వెలిబుచ్చిన ఒక్క చిరునవ్వే చాలు.

మొహాన ఎందుకు బొట్టుపెట్టలేదని అడిగాడు.

అలవాటు లేదన్నాను.

అలా కూడదన్నాడు. పైగా రేపు సాయంత్రము ఇక్కడికొచ్చేటప్పుడు బొట్టుపెట్టుకొని మరీ రావాలన్నాడు.

శిరః కంపనం చేశాను.

ఈ కాలంలో బ్రాహ్మలు అనేక మంది తప్పుదారిలో నడుస్తున్నారనీ, పైగా పురాతన సంప్రదాయాలనూ, ఆచారవ్యవహారాలను నాటికీ

నేటికీ వదలకుండా వస్తున్నది నూటికి యే ఒక్కరోనని, ఆ ఒక్కరిలో తాను కూడా వున్నానని అన్నాడు

తాళం వేశాను

కాసేపు ఆగాక కడుపునిండా గాలి పీల్చుకొని "వివాహమైందా?" అని అడిగాడు.

"ఇంకా కాలే"దన్నాను కాస్త సిగ్గుతో.

అమాంతంగా భూమిలోకి దిగబడిపోయిన వానిలా మొహం పెట్టి "ఆఁ, కాలేదూ? నీకు కాకపోవటానికేమిటయ్యా! నువ్వు తోటకూర కాడలా పెరిగి పోతున్నావు. బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికిరాదన్న సంగతి నువ్వెరగవా? నీకింకా పెళ్ళి కాలేదంటే నాకు చచ్చేంత సిగ్గుగా ఉంది. మంచి వయస్సులో వున్న వాడివి... ఇంతకీ ఎక్కడ పని చేస్తున్నావు నాయనా?"

చెప్పాను.

"అయ్యయ్యో! ఇదీ ఒక ఉద్యోగమేనా? మాంచి గవర్నమెంట్ పర్మనెంట్ జాబ్‌లో చేరక ఇదేమిటి నాయనా? ఇలాంటి ఉద్యోగం ఎన్నాళ్లుంటుంది? రిటైరయితే విరామ వేతనం కూడా ఇవ్వరు కదా!" అన్నాడు.

పరిస్థితులు వివరించాను.

"నా బాల్య మిత్రుడొకడు ఇక్కడనే ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజ్‌లో పని చేస్తున్నాడు. అతన్ని రేపు కలుసుకొని ఎక్కడైనా ఖాళీలున్నాయేమో కనుక్కొని చెబుతాను" అన్నాడు.

ఆమాత్రం సాయం చేసి పెడితే నా చర్మంతో చెప్పులు కుట్టిస్తానని అన్నాను.

"నా ఎరికలోనే ఓ సంబంధ ముంది. బోలెడంత ఉన్నవాళ్లు. ఒక్కతే అమ్మాయి, పనీపాటా అంతా చక్కగా చేసి పెడుతుంది. నువ్వు ఊఁ అంటే రేపు వైశాఖ పౌర్ణమికే నీ చేత తాడు ముడి పెట్టిస్తా"నన్నాడు.

హోటల్ మెతుకులు తినలేక చచ్చిపోతున్నానని, ఆ మాత్రంకూడా చేసి పెడితే, చస్తే ఆయన కడుపులో పుట్టానని అతి నమ్రతతో అన్నాను.

బుద్ధిమంతుడవన్నాడు.

నేనేమీ గర్వపడలేదు.

ఈ కాలపు కుర్రాళ్లలో ఉండే పోకిరి వేషాలు నాలో ఉన్నట్లు లేవన్నాడు.

అప్పటికీ నేను గర్వపడలేదు.

"చీకటి పడుతూందబ్బాయ్, వస్తాను. రేపు ఇక్కడే కలుసుకో" అని లేచి బయలు దేర బోయాడు.

హృదయపూర్వకంగా నమస్కరించి నేనూ సెలవు పుచ్చుకున్నా.

ఆ మర్నాడు, సాయంత్రం ఎప్పుడెప్పుడవుతుందా, ఎప్పుడెప్పుడు పార్కులో ఆపద్బాంధవుణ్ణి కలుద్దామా అని గంపెడాశతో వున్న నన్ను వద్దు వద్దన్నా బలవంతంమీద కొంత మంది మొండి రాయుళ్లు సినిమాకు లాక్కొని పోయినందున పార్కుకు వెళ్ళటానికి వీలు కాకపోయింది నాకెంతో విచారం వేసింది ఏదో పెద్దతప్పు చేసినట్లు భయం వేసింది. పాపం ఆ బ్రాహ్మణుడు నాకోసం ఉద్యోగం సంగతీ, పెళ్ళి సంగతీ అన్నీ విచారించి, యజ్ఞోపవీతం కూడా తెచ్చి పార్కులో నిన్నటిచోటులో కూర్చొని లేచి వుంటాడేమో పాపం. ఆయనకు ఎంత ఆశాభంగం కల్గివుంటుందో, ఒకవేళ ఆ మహానుభావునికి నామీద విసుగుదల కల్గినా కూడా కల్గవచ్చు. సినిమాలో కూర్చున్నంతసేపు ఈ ఆలోచనలతో సతమతమైపోతున్నానే కానీ, తెరమీది బొమ్మలను చూడటం కానీ, ఆ ఎరువు గొంతులను వినటము కానీ ఏదీ లేదు.

మరుచటిరోజు సాయంత్రం నాల్గుగంటలకే పసిగట్టి జ్ఞప్తికి తెచ్చుకొని మొహంనిండా నిమ్మకాయంత బొట్టుపెట్టుకొని పార్కుకు బయలుదేరాను. ఆ వ్యక్తి నస్యం పీలుస్తూ కూర్చొనున్నాడు అదే బల్లపైన

• వెళ్ళి నమస్కరించా. ఆయన బలవంతం మీద నమస్కారం—కమ్-ఆశీర్వాదం చేశాడు మొన్న ఆయన మొహంలో ఉన్నంత చురుకుతనం ఈవేళ లేదు. చాలా చప్పగా ఉన్నాడు. బహుశా నామీద కోపం కల్గిందేమో ననుకున్నా. అలాంటి సూచనలుకూడా నాకు ఏవీ కన్పడలేదు. తనలో తాను కర్నాటక సంగీతం, సన్నగా కూనిరాగాలు తీస్తున్నాడు.

ఉపోద్ఘాతం ఎలా ప్రారంభించాలో సమయానికి తోచక, ఉన్నట్లుండి, "నా ఉద్యోగం గురించి — మీ బాల్య మిత్రులు ఎవరిదగ్గరో ప్రయత్నిస్తానని అన్నారు! ..." అని అన్నాను.

"ఉద్యోగం గురించా, అవును చూడబ్బాయ్! ఆ బాలమిత్రుల్ని నేను చూసి చాలా రోజులైందన్న మాట. నేను నిన్న మధ్యాహ్నం వాళ్ళింటికెళ్ళేసరికి, ఆయన మొన్ననే హఠాత్తుగా గుండె ఆగి మరణించాడన పిడుగులాంటి వార్తను, నా చెవిలో వేయించుకొని అమిత విచారంతో ఇంటికి తిరిగివచ్చా" అని కొంత విచారంతో అన్నాడు. అంతే కాదు. చివరి ఆ రెండు ముక్కలకి ఆయన గొంతు బొంగురుపోయింది కూడానూ.

"అయ్యో — పాపం!" అని నేనూ సంతాపం సూచించాను.

"విచారించి ప్రయోజనమేముందిఅబ్బాయ్. ఆయన కాలం తీరింది — ఆయన పోయాడు. లోకములో ప్రతిరోజూ కొంతమంది పుట్టూంటారు, కొంతమంది పోతూంటారు" అని వేదాంత ధోరణిలో మాట్లాడాడు.

"అంతేలెండి. ఉన్న సంగతి అన్నారు. అన్నట్లు మీ యెరికలో ఏదో సంబంధం ఉందన్నారు" అని జ్ఞప్తికి తెచ్చాను.

"ఆఁ... అన్నానుకదూ. కాని ఆ అమ్మాయిది అత్తలేని జాతకమటూ బాబూ! మరి నీకు అమ్మ వుందికదూ!" అని అడిగాడు.

ఉందన్నాను.

మళ్ళీ ఆ వైపుకి మొహం తిప్పుకొని ఏదో కూనిరాగాలు తీస్తున్నాడు.

"అన్నట్లు, యజ్ఞోపవీతం తెచ్చారాండీ?" అని ఉన్నట్లుండి జ్ఞప్తికి తెచ్చుకొని అడిగాను.

"యజ్ఞోపవీతమా! లేదు నాయనా. ఉదయాన నా మనుమడు బొమ్మను విరగ్గొట్టేసి ఏడుస్తూ కూర్చుంటే, ఆ బొమ్మను బిగించి కట్టటానికి సమయానికి ఏ తాడూ దొరకనందున, నేను వెంటనే ఆ యజ్ఞోపవీతాన్ని వదిలి తెచ్చి కట్టేశాను" అన్నాడు, ముక్కునించి నశ్యం పొక్కులను తీసి చేతిలో కస్తూరి మాత్రలాగ నలుపుతూ.

ఉండబట్టలేక ఎలాగో ఓలాగు సాహసించి "ఈ వేళ ఏదో ఓ మాదిరి ఉన్నారూ?" అని పుటుక్కున అడిగేశా.

"ఆఁ ఏమాదిరి ఉన్నానూ? మన మెప్పుడూ మారమే. ఎప్పుడూ ఒకేలాగా వుంటాం. చిన్నప్పుడు చింతకాయలేరుకు తిన్న సంగతి చచ్చినా మరవం" అన్నాడు.

ఏం మాట్లాట్టానికీ తోచక "చూశారా! ఆజ్ఞ ప్రకారం బొట్టు పెట్టుకొనొచ్చా" అన్నాను మొహాన్ని ఆయన దగ్గరకు తీసుకువెళ్ళి.

"అఁహాఁ! బొట్టు పెట్టుకొచ్చావా, నా కంటికి కనపడటంలేదు నాయనా. నావి గుడ్డికళ్లు. సులోచనాలను ఇంటివద్దనే పెట్టివచ్చా" అన్నాడు కాస్సేపు ఆగాక "మొన్న నువ్వు నన్ను కలిశావా?" అని అడిగాడు.

దాదాపు గుండె ఆగినంత పనైంది నాకు. తెప్పరిల్లాక "మరి మొన్న కలవ లేదటండీ ఇక్కడే, ఈ బల్లమీదనే" అన్నాను.

"ఏమో నాయనా! ఈ పార్కుకి ఎంతోమంది వస్తూ పోతూంటారు. ఈ బల్లమీద కూడా ఎంతోమంది, కాకి వాలినట్లుగా కూర్చొని పోతూంటారు. నేనుమాత్రం ఎందరినని గుర్తులో పెట్టుకోనేది" అని ఆవులించాడు.

నేను నిట్టూర్చాను. "వస్తానండీ" అని లేచి నమస్కరించా. ఆ మహానుభావుడు వినీ విననట్లు నటించాడు.

బరువైన హృదయంతో ఇంటి మొహం పట్టాను.

ప్రఖ్యాత డిటెక్టివ్ నవలా రచయిత సర్ ఆర్థర్ కానన్ డైల్ ఒకసారి — పెద్దమనుషులూ, సంఘంలో గౌరవంతోనూ, హోదాతోనూ బతుకుతున్న ఆరుగురు మిత్రులకి వేర్వేరుగా యీ విధంగా టెలిగ్రాం యిచ్చాడు: "లాభం లేదు: మీ గుట్టు అంతా బయటపడిపోయింది. పోలీసులకి పట్టుబడకండా తక్షణం పారిపోండి." టెలిగ్రాం చదువుకున్న ప్రతి పెద్దమనిషీ ఆ సాయంత్రమే లండన్ వదలి పారిపోయాడు.